క్లుప్తంగా

'పెన్షనర్ల సమస్యలపై కేంద్రం మొండి వైఖరి'



ధర్నాలో పాల్గొన్న పెన్షనర్లు

విశాఖ విద్య: పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మద్దిపాలెం లోని పీఎఫ్ రీజినల్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నా కొనసాగుతోంది. మూడో రోజు బుధవారం జరిగిన ధర్నాలో బీహెచ్ఈఎల్ రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే హుస్సేన్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరించడం సరికాదన్నారు. పెన్షనర్లు కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు తీరేలా మినిమం పింఛన్ అమలు చేయాలన్నారు. రైల్వే రాయితీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ కేబుల్ దగ్ధం



వైర్‌కు నిప్పు అంటుకున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద విద్యుత్ స్తంభానికి గల సర్వీస్ వైర్‌కు బుధవారం ఉదయం నిప్పు అంటుకుంది. దీంతో స్తంభం పై నుంచి చిన్న నిప్పు రవ్వలు పడడంతో అటువైపు రాకపోకలు సాగిస్తున్న వారు కలవరం చెందారు.వెంటనే ఆ ప్రాంత యువకులు మల్కాపురం సబ్ స్టేషన్ కార్యాలయానికి ఫోన్ ద్వారా సమచారం ఇచ్చారు. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపి వేసి విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేశారు.

తనిఖీల్లో 84 వాహనాల సీజ్



ద్వారకా, ఫోర్త్‌టౌన్ పీఎస్‌ల ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ అయ్యనార్ ఆదేశాల మేరకు ద్వారకా, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము 5 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్వారకా పీఎస్ పరిధిలో సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధరేంద్ర, ఆర్ఐల నేతృత్వంలో గురుద్వారా, సీతంపేట దుర్గాగణపతి ఆలయం, ఆశీలమెట్ట, ద్వారకానగర్, రామాటాకీస్, సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్, సైలెన్సర్లు, పత్రాలు, మద్యం తాగిన నడిపిన 62 వాహనాలను సీజ్ చేశారు. ఫోర్త్‌టౌన్ పీఎస్ పరిధిలోని దొండపర్తి, డైమండ్ పార్కు, అక్కయ్యపాలెం హైవే తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 22 వాహనాలను సీజ్ చేశారు. దీంతో ఈ రెండు పోలీస్ స్టేషన్ల ఆవరణ ద్విచక్ర వాహనాలతో నిండిపోయింది.

నగదు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ఎంవీపీ కాలనీ: ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎంవీపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి సత్యం కూడలి వద్ద నాకాబందీ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద రూ.4,29,100 నగదును ఎంవీపీ సీఐ సంజీవరావు గుర్తించారు. దీంతో ఆ నగదుకు సంబంధించి వివరాలు అడగ్గా విజయనగరం నుంచి వస్తున్న జైకుమార్ అనే ఆ వ్యక్తి నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకున్న ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపేదల చెంతకు కార్పొరేట్ వైద్యం

- 59వ వార్డులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన
- 346 మందికి రోగులకు వైద్యం, మందుల పంపిణీ



శిబిరంలో బారులు తీరిన రోగులు



రిజిస్ట్రేషన్ కేంద్రం వద్ద రోగుల వివరాలు తెలుసుకుంటున్న సిబ్బంది

మల్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో నిరుపేదలకు కార్పొరేటర్ వైద్యం చేరువైంది. పైసా ఖర్చు లేకుండా తమ ఇంటి చెంతకే పలువురు వైద్య నిపుణులు వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు మందులు పంపిణీ చేస్తుండడంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) వద్ద బుధవారం



శిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ సచివాలయం–330 పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరానికి సుమారు 346 మంది రోగులు వివిధ సమస్యలపై వచ్చి వైద్య సేవలు పొందారు. సాధారణ సమస్యలపై 161 మంది, చర్మ వ్యాధులకు సంబంధించి 44 మంది, చెవి, ముక్కు సమస్యలపై 51 మంది, ఆర్థో సమస్యపై 55 మంది, దంత వ్యాధులపై 35 మంది ఈ శిబిరంలో ఆయా వైద్య నిపుణుల వద్ద పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు అవసరమైన మందులు వైద్య సిబ్బంది అందజేశారు. ఈ శిబిరాన్ని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ శశిభూషణరావు, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుల్రె సురేష్‌యాదవ్ సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు.

వినికిడి సమస్యకు పరిష్కార మార్గం చూపారు..



గత ఐదేళ్ల నుంచి వినికిడి సమస్యతో బాధపడుతున్నాను. దీనిపై ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాలంటే చాలా ఖర్చు అవుతుందని, ఇన్నాళ్లు మౌనంగా ఉండిపోయాను. సీఎం జగన్ ఆరోగ్య సురక్ష శిబిరాల ఏర్పాటు విషయం వలంటీర్ ద్వారా తెలుసుకున్నాను. నా వినికిడి సమస్యకు వైద్యులు ఓ పరిష్కార మార్గాన్ని చూపారు. దీంతో మనోధైర్యం వచ్చింది.

– రమణమ్మ, ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ

ఆయాసంతో బాధపడుతున్నాను..



గత కొంత కాలంగా ఆయాసంతో బాధపడుతున్నారు. ఇక్కడ ఆస్పత్రి వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా వైద్య సేవలు అందుతున్నాయని తెలుసుకుని వచ్చాను. వైద్య నిపుణులకు సమస్య వివరించాను. వారు కొన్ని టెస్టులు చేసి, దానికి తగ్గ మందులు ఇచ్చారు. ఉచితంగా ఇలాంటి సేవలు గతంలో ఏ ప్రభుత్వం చేయలేదు.

– ఎం.డి.అన్వార్, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ

మానసిక స్థైర్యం నింపాం..



ఆరోగ్య సురక్ష కేంద్రానికి వచ్చిన ప్రతి రోగికీ అవసరమైన వైద్య సేవలు అందించాం. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలాంటి మందులు వాడాలో అన్నదానిపై అవగాహన కల్పించాం. వారిలో మానసిక స్థైర్యాన్ని తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకున్నాం.

– డాక్టర్ సాయిరూప, వైద్యాధికారి

ఎల్‌పీజీ ప్లాంట్‌లో మాక్ డ్రిల్



ప్రమాదాలపై డ్రైవర్లకు సూచనలిస్తున్న అధికారులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌తో పాటు ఎల్‌పీజీ ప్లాంట్‌లో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. సంస్థలో అనుకోకుండా ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే కార్మికులు ప్రమాదం నుంచి ఎలా తప్పుకోవాలి.. ప్రమాద బారిన పడిన వారిని ఎలా సురక్షితంగా బయటకు తీసుకురావాలన్న అంశంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి పాల్గొని ప్రమాదాలపై కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు,కార్మికులు పాల్గొన్నారు.

20 కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న యువకుడిని పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ..జి.మాడుగుల నుంచి నగరానికి బైక్‌పై గంజాయి తరలిస్తున్న జగంధర్ గొవిడ బుధవారం పినగాడి పరిసర ప్రాంతంలో అనుమానాస్పందంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. బ్యాగులో 20 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి పోలీసులు అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు. బైక్ సీజ్ చేశారు.

'పశ్చిమ'లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడించేందుకు కార్యకర్తలు, నాయకులు సన్నద్ధం కావాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు దిశా నిర్దేశం చేశారు. బూత్ లెవల్ కమిటీ సభ్యులతో మద్రిపాలెం వుడాలేఅవుట్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన సమావేశం నిర్వహించారు. జీవీఎంసీ 91, 92 వార్డుల బూత్ లెవల్ కమిటీ సభ్యులు ఓటరు జాబితాను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. నివాసముంటున్నవారి వివరాలు పరిశీలించాలని తెలిపారు. అక్కడ నివాసముంటున్నారా, వలస వెళ్లారా ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారన్న వివరాలు సేకరించాలని సూచించారు. అలాగే 80 ఏళ్ల పైబడిన వారు, 40 శాతం అంగవైకల్యం ఉన్నవారిని గుర్తించాలని తెలిపారు. బ్యాలెట్ ఓట్లను గుర్తించి వైఎస్సార్ సీపీ నాయకులకు, బీఎల్ఏలకు తగు సూచనలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలతో పాటు అభివృద్ధిని ప్రతి గడపకూ తీసుకెళ్లాలని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో పశ్చిమంలో వైఎస్సార్ సీపీ విజయం కోసం సైనికుల్లా పని చేయాలన్నారు. సమావేశంలో 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, బీఎల్ఏలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గద్దర్ స్ఫూర్తితో ఉద్యమం ఉధృతం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రజా గాయకుడు గద్దర్ స్ఫూర్తితో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. గద్దర్ ప్రధానంగా పాలకుల వైఫల్యాలను, తద్వారా ప్రజలపై పెరుగుతున్న భారాలకు వ్యతిరేకంగా తన గళాన్ని విప్పి ప్రజాచైతన్యం కలిగించారని, అదే రీతిలో పోరాడదామన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1091వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎస్.ఎం.ఎస్–1 విభాగ కార్మికులు, ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిపరంగా ఆటంకాలను సృష్టిస్తూ.. కార్మిక శక్తిని అణగదొక్కే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలన్నారు. కార్మికుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సమష్టి పోరాటం



సెమినార్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వివిధ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: సమష్టి పోరాటాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందామని వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన సెమినార్‌లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, సీపీఐ జాతీయ కార్యదర్శి ఎ.రాజా, విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, ఏఐటీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి అమరజీత్ కౌర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్, జై భారత్ పార్టీ అధ్యక్షుడు జె.డి.లక్ష్మీనారాయణ పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్ర బీజేపి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మూడేళ్లుగా కార్మిక వర్గం ఆందోళన చేస్తోందని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ఆందోళనలు చేయడం ద్వారా ప్లాంట్‌ను కాపాడుకుందామని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సీహెచ్. నర్సింగరావు, కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, వై.మస్తానప్ప, జి.గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని నడిపించేది సాహిత్యం



మాట్లాడుతున్న సూర్యప్రకాశరావు

సీతంపేట: సమాజాన్ని సరైన మార్గంలో నడిపించేది సాహిత్యమని నవసాహితి ఇంటర్నేషనల్(చెన్నై) అధ్యక్షుడు ఎస్.వి.సూర్యప్రకాశరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళ నంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సాహిత్యం ప్రతి ఒక్కరికీ అవసరమని, అది హృదయానికి సంబంధించినదన్నారు. మానవ సంబంధాలు, అనుబంధాలకు సాహిత్యం వారధి అని పేర్కొన్నారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడు తూ మారుతున్న సమాజంలో సాహిత్యం ముఖ్య భూమిక పోషిస్తూ జనుల్లో విలువలను, ఆత్మీయతను పెంపొందిస్తుందన్నారు. డాక్టర్ కె.జి.వేణు బంగ్లాదేశ్ కవి రచయిత ఖాజీ నజ్రుల్ ఇస్లాం సాహిత్యం, జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు సిహెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరి రమణ, డాక్టర్ డి.వి.సూర్యారావు, భాగవతుల సత్యనారాయణమూర్తి, వెలమల సిమ్మన్న, కె.వి.ఎస్.మూర్తి, కె.భీమేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ఎరుకుమాంబకు భక్తుల జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. దొండపర్తి, నెహ్రూబజార్, రైల్వే న్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్‌ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పసుపు, కుంకుమ, పలు రకాల పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి చీరల బహిరంగ వేలం..

ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్లు గురువారం 8వ తేదీన, మరల 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి దేవస్థానం ప్రాంగణంలో బహిరంగ వేలం వేసి విక్రయిస్తామని ఆలయ ఈవో రమాబాయి, చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

మార్చి 20 నుంచి అనంతుని కల్యాణోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో మార్చి 20 నుంచి 26 వరకు జరగనున్న అనంతుని కల్యాణోత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు కోరారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో బుధవారం కల్యాణోత్సవాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవస్థానం, ఉత్సవ కమిటీ సంయుక్తంగా కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 20న పుట్ట బంగారం తేవడంతో అనంతుని కల్యాణోత్సవాలకు అంకురార్పన జరుగుతుందన్నారు. 21న అనంతుని కల్యాణం, 23న తెప్పోత్సవం, 24న అనంతుని రథోత్సవం జరుగుతుందన్నారు. 26న పుష్పాంజలితో అనంతుని కల్యాణోత్సవాలు ముగుస్తాయన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, సుంకర నారాయణరావు, భక్తబృందం సభ్యులు కంటుబోతు ఎర్నాయుడు, మొకర సన్నిబాబు, అలయ ప్రధాన అర్చకుడు పి.సీతారామాంజనేయ స్వామి పాల్గొన్నారు.

అత్తింటి ఎదుట కోడలి నిరసన

కూర్మన్నపాలెం: భర్త విడాకులు కావాలంటూ లాయర్ నోటీసు పంపడంపై ఆగ్రహించిన ఓ యువతి అత్తింటి ఎదుట నిరసనకు దిగింది. ఈ సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలు చట్టి రమ్య తెలిపిన వివరాలివి.. పెదగంట్యాడకు చెందిన రమ్యకు అగనంపూడికి చెందిన ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుడు చట్టి వెంకటఅప్పారావుతో 2021లో వివాహమైంది. ఆ సమయంలో రూ.5 లక్షల నగదు, బైక్, రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షలు విలువ చేసే సారె ఇచ్చారు. పెళ్లయిన మూడు నెలలు కాపురం బాగానే సాగినా.. అనంతరం అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు ఎక్కువయ్యాయి. అనారోగ్యానికి గురై, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రమ్యకు ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన అనంతరం ఆమె కన్నవారింటికి దేవాడ వెళ్లిపోయింది. ఈనెల 3న భర్త వెంకట అప్పారావు నుంచి తనకు విడాకుల నోటీసులు వచ్చాయి. బుధవారం ఆమె గ్రామ పెద్దలను తీసుకొని అత్తింటికి వెళ్లగా వారు లోపలకు రానివ్వలేదు. దీంతో ఆమె అత్తింటి ఎదుట నిరసనకు దిగింది. సమాచారం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రమ్యను, అత్తింటి వారిని పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా సూచించారు. స్టేషన్‌లో రమ్య ఫిర్యాదు మేరకు ఇరువురిని కౌన్సెలింగ్ నిమిత్తం దిశ పోలీస్‌స్టేషన్‌కు పంపుతున్నట్లు దువ్వాడ పోలీసులు తెలిపారు.

రమాబాయి జీవితం ఆదర్శనీయం



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

మల్కాపురం: రమాబాయి అంబేడ్కర్ జీవితం మహిళలకు ఆదర్శనీయమని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. రమాబాయి అంబేడ్కర్ జయంతి సందర్భంగా మల్కాపురం సెయింట్ ఆన్స్‌లో బుధవారం మహిళా కళాశాల వద్ద రమాబాయి జయంతిని నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ 1898లో జన్మించిన రమాబాయి ఎనిమిదేళ్ల వయసు లోనే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను వివాహం చేసుకున్నారన్నారు. అనేక దళిత ఉద్యమాల్లో రమాబాయి కీలక పాత్ర పోషించారన్నారు. తన 37వ ఏట ఆమె అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి,గ్రంథాలయాధికారి శిరీష, అధ్యాపకులు శాంతి, లక్ష్మీదేవి,సలోమి పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు

- దివ్యాంగులు, ఓటర్లకు మౌలిక వసతులు కల్పించండి
- అధికారులతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్, పాల్గొన్న అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

మహారాణిపేట: సాధారణ ఎన్నికలకు ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు తప్పక కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఏఈఆర్వోలు, వివిధ శాఖల అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని బీఎల్వోలతో కలిసి తనిఖీ చేయాలని ఆదేశించారు. కేంద్రం వద్ద దివ్యాంగులకు ర్యాంపులు, ఓటర్లకు టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ బూత్ బయట ఆ కేంద్రం వివరాలు తప్పక నమోదు చేయాలని చెప్పారు. 10 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న ఇళ్లను పరిశీలించాలన్నారు. జనవరి 5 తరువాత అందిన ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, చేరికలు, తొలగింపులు జాగ్రత్తగా చేపట్టాలన్నారు.

సమస్యలుంటే తెలపండి..

ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తక్షణం తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జేసీ మయూర్ అశోక్ కోరారు. కలెక్టరేట్‌లో తూర్పు నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. తూర్పు పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని కేంద్రాల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏఈఆర్వోలు, అధికారులు, సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



రవికుమార్ మృతదేహం

పరవాడ(పెందుర్తి): లంకెలపాలెం–సబ్బవరం రహదారిలో మంత్రిపాలెం కూడలి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని కాకినాడకు చెందిన ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానికులు, పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కాకినాడ రూరల్(నియర్ కరెంట్ ఆఫీస్)కు చెందిన టి.రవికుమార్(47) అనే లారీ డ్రైవర్ బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మంత్రిపాలెం కూడలిలో రోడ్డు పక్కన తన లారీని నిలిపి సొంత పనిపై రహదారి దాటుతున్నాడు. ఇంతలో వెనుక నుంచి వచ్చిన మరో వాహనం అతడిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవికుమార్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. స్థానికులు అందించిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పరవాడ పోలీసులు మృతుడి వద్దనున్న ఆధారాల సాయంతో కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. మృత దేహన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించామన్నారు.

భవన నిర్మాణాలపై 1 శాతం సెస్ చెల్లించాలి

సీతంపేట : జిల్లాలోని అన్ని కన్‌స్ట్రక్షన్ యూనిట్లు, భవనాల నిర్మాణానికి వెచ్చించే వ్యయంలో 1 శాతం సెస్ రూపంలో ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని భవన, ఇతర నిర్మాణాలు చేపట్టే యజమానులు తమ నిర్మాణాలను ఎస్టాబ్లిష్‌మెంట్ రూపంలో సమీప మీ సేవా, లేదా వార్డు సచివాలయంలో గాని, మీ సేవా పోర్టల్‌లో గాని నమోదు చేసుకోవ్చని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఫారం సీ రూపంలో రిటర్న్ కార్మిక శాఖ సంబంధిత అధికారికి అందజేయాలన్నారు. జిల్లాలో భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు, భవన నిర్మాణ కార్మిక చట్టం 1996 ప్రకారం భద్రతా చర్యలు తీసుకోవాలని, కార్మికులకు హెల్మెట్‌లు, రక్షణ గ్లౌజ్‌లు, ఎత్తులో పనిచేసే వారు కింద పడిపోకుండా కాపాడే యంత్ర సదుపాయం కల్పించాలని చెప్పారు. జిల్లాలోని వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు తమ సంస్థలను ఈ నెల 29లోగా సమీప మీ సేవా కేంద్రంలో గాని, వార్డు సచివాలయంలో గాని రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ పూర్తి చేయాలని తెలిపారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్ స్పష్టం చేశారు.